# పుత్రేషణ

## భమిడిపాటి భాస్కర రామారావు

విజయ విచారంగా ఉంది. పెళ్ళయి పన్నెండేళ్ళయినా సంతానం కలగలేదు విజయకు. ఆమె విచారానికి మూల కారణం కేవలం అదికాదు. ఆ రోజు సాయంత్రం మూడూ నాలుగు గంటల వేళ తన అత్తగారు పక్కింటి పిన్నిగారితో అన్న మాటలు ఆమె హృదయాన్ని ములుకుల్లా తాకి గాయ పరిచాయి. ఆ నాడు మనవడ్ని చంక నేసుకుని వచ్చిన పిన్నిగారితో తన అత్త, "నీకేమమ్మా! మహారాజువి. మనుమలు మనుమరాండ్రతో నీ యిల్లు దొడ్డ తోటలా కళకళలాడుతూ ఉంటుంది. ఇక నా యింట్లో సంటావా. ఏది? ముచ్చటకేనా ముద్దు ముద్దుగా చిలుక పలుకులు పలికే చిన్నారి ఒక్కరు కూడా లేరు.

నా కొడుక్కి పెళ్ళి చేసి పుష్కరం గడిచింది. ఏదీ? అంతా నా తలరాత. నా ఖర్మ! మా వాడి పాలికి ఈ గొడ్రాలు దాపురించింది.

అక్కడికీ నా కొడుక్కి చిలక్కి చెప్పినట్టు చెబుతూనే ఉన్నాను. ఈ గొడ్డుమోతు మొహాన్ని విడిచి పెట్టి ఎంచక్కా మరో పెళ్ళాన్ని తెచ్చుకోరా అని. అబ్బే! వింటేనా వాడు. ఈ వగలమారి బొమ్మ మోజులో నా మాటలన్నీ చెవిటికి శంఖూదిన చందమేనాయె! అంతా నా ఖర్మ" అంది.

విజయతో రాజశేఖరానికి పెళ్ళయి పన్నెండేళ్ళు గడిచినా పిల్లలు పుట్టలేదని పక్కింటి పిన్ని గారికీ తెలుసు. పిల్లల కోసమని ఆ దంపతులు చేయని వ్రతాలూ నోచని నోములూ లేవని కూడా తెలుసు. రాజశేఖరం అన్నగార్లకు గంపెడు గంపెడు సంతానం ఉన్న సంగతీ ఆవిడకు తెలుసు.

అయితే ఆమెకు అర్థంకాని దల్లా ఒక్కటే! ఏ తోటికోడలూ చేరనివ్వని అత్తగారిని దగ్గర పెట్టుకుంది విజయ. అంతేకాక కన్నతల్లి కంటే ఎక్కువగానూ ఎంతో అపురూపంగానూ చూచుకుంటుంది. అలాటి కోడలు మీద ఆవిడ ఎప్పుడూ ఎందుకు అల్లా విరుచుకు పడుతూ ఉంటుందో అని.

అసలే బిడ్డలు లేరన్న దిగులుతో కృంగి పోతోంది కోడలి మనసు. అలాటిది యిక తన మాటలనే ఈటెల ఘాతాలకు మరెంత వ్యథకు లోనవుతుందో ఒక్క క్షణమైనా ఎందుకు ఆలోచించదా అన్న విషయం కూడా ఆమెకు అర్థం కాని సమస్యే!

ఇంకా తాను ఆలస్యం చేస్తే విజయ మీద ఆమె దాడి మరింత ఉధృతం అవుతుందన్న సత్యం ఎరిగినది కావడంతో, "ఇదిగో వదినా! ఈ రోజు పురాణం సీతా కళ్యాణఘట్టం. మంచి రసవత్తరంగా ఉంటుంది. లే! ఆలస్యం అయితే ఎక్కడో వెనుక వరుసల్లో కూచో వాల్సి వస్తుంది" అని హెచ్చరించింది.

"ఔనౌను సుమా!" అంటూ బయలుదేరింది విజయ అత్తగారు.

అదిగో! ఆ క్షణం నుండి రంపపు కోతకు గురవుతోంది విజయ హృదయం. అలా పరధ్యానంగా కూచున్న విజయకు దిగంతాల్లో మసక చీకట్లు కమ్ముకుంటున్న వైనం కూడా తెలియటం లేదు. భర్త తన వ్యాపార స్థానం నుండి తిరిగి వచ్చే వేళ అవుతోందనే స్పృహ కూడా లేదు. కళ్ళ వెంటనయితే ధారలుగా కారడం లేదు గాని ఆమె గుండె మూగగా రోదిస్తోంది.

చీకట్లు నలుదిశలా కమ్ముకుంటున్న ఆ సమయంలో రాజశేఖరం ఇంట్లో అడుగు పెట్టాడు. హాల్లో సోఫాలో కూచుని ఉన్న విజయ మసక మసకగా కనిపిస్తోంది. ఆ వేళకు ఇంట్లోని స్థితిని చూచి విజయ విచారిస్తోందని గ్రహించాడు రాజశేఖరం. అందుకు కారణం కూడా అతడికి తెలిసినదే! ఆ రోజు కూడా తల్లి విజయను ఏవో సూటీపోటీ మాటలతో బాధించిందన్నమాట.

నిశ్శబ్దంగా హాల్లోకి నడిచి టక్కుమని స్విచ్చి నొక్కాడు రాజశేఖరం. ట్యూబ్ లైట్ కాంతి పాల వెన్నెలలా హాలంతా ఆవరించింది.

తపోభంగమయిన యోగినిలా చటుక్కున తల ఎత్తి చూచింది విజయ. ఎదురుగా భర్త.

వెంటనే లేచి ఆమె వంట యింటి వైపుగా నడిచింది.

రాజశేఖరం ఉస్సురని నిట్టూరుస్తూ ఫాంటు స్లాకుల నుండి లుంగిలోకి మారి బాత్‌రూమ్‌కు వెళ్ళికాళ్ళూ చేతులూ ముఖంకడుక్కుని తువ్వాలుతో తుడుచుకుంటూ వచ్చి హాల్లో సోఫాలో కూచున్నాడు.

విజయ కాఫీ కప్పుతో వచ్చింది.

రాజశేఖరం మౌనంగా కాఫీ తాగాడు. కప్పు సాసరు ఎదురుగా ఉన్న టీపాయ్‌మీద పెట్టాడు.

"ఏమండీ!" పిలిచింది విజయ.

"ఏం విజయా!" అంటూ ఆమె వైపు చూచాడు రాజశేఖరం. విజయ ముఖం వర్షించడానికి సిద్ధంగా ఉన్న మేఘంలా ఉంది.

"ఏమండీ!" మళ్ళీ పిలిచింది విజయ.

"చెప్పువిజయా!" లాలనగా అన్నాడు రాజశేఖరం.

విజయ చటుక్కున రాజశేఖరం కాళ్ళ ముందు కూచుంది.

"నేన చిత్తక్షోభ భరించలేనండీ!" అంటూ ముఖం అతడి ఒడిలో ఉంచి వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

"మా అమ్మ ఇవాళ కూడా నిన్ను బాధ పెట్టిందా విజయా?" ఆమె తలనిమురుతూ లాలనగా అన్నాడు రాజశేఖరం.

"ఏమండీ! ఈ గొడ్డు మోతు దానితో ఎన్నాళ్ళు కాపురం చేస్తారండీ! మానవుడు ఈషణ త్రయానికి అతీతుడు కాడండీ! అందులో పుత్రేషణ కూడా ఒకటండీ! నా మాట వినండి. మీరు మరో ఆమెను చూచి పెళ్ళాడండి. కనీసం ఆమె కడుపునన్నా ఓ కాయ కాస్తే ..."అంటూ వెక్కిళ్ళ మధ్య మాట పూర్తి చేయలేక పోయింది విజయ.

విజయ స్థితి చూచి రాజశేఖరం కళ్ళలో కూడా గిర్రున నీళ్ళు తిరిగాయి. కాని నిగ్రహించుకున్నాడు. ఉపశమన పూర్వకంగా విజయ తల నిమురుతూ కొద్ది క్షణాలు మౌనంగా ఉండిపోయాడు.

విజయ కాస్త స్థిమితపడింది.

"విజయా!" పిలిచాడు రాజశేఖరం.

చెప్పండన్నట్టు తలఎత్తి చూచింది విజయ.

రాజశేఖరం విజయ భుజాలు పట్టుకుని లేవదీసి సోఫాలో తన పక్కన కూచో పెట్టుకున్నాడు.

"విజయా! మనం ఇద్దరం కలిసి స్పెషలిస్టుల చేత పరీక్షలు చేయించుకున్నాం. మనిద్దరిలోనూ కూడా లోపం లేదని ప్రతి స్పెషలిస్టూ చెప్పాడు.

మా అమ్మ ఏదో మూర్ఖంగా అలా అందే అనుకో! నువ్వూ అదే పట్టుకు కూర్చుంటే ఎలా?"

"ఏమోనండి. ఎవరి అదృష్టం ఎలాటిదో మనం ఏం చెప్పగలం?" నిస్పృహగా అంది విజయ.

"అవునా? అలాటప్పుడు నేను మరో పెళ్ళి చేసుకుంటే మాత్రం పిల్లలు పుట్టి తీరుతారని గ్యారంటీ ఏమిటి? విజయా!ఇప్పుడంటే అన్నావు కాని మరింక ఎప్పుడూ ఆ ప్రసక్తి తేకు సుమా!' అన్నాడు రాజశేఖరం.

"మరి మనమూ పెద్దవాళ్ళం అయిపోతున్నాం, మనకంటూ మనవాడనే పిల్లాడు ఒకడుండొద్దు టండీ!"

"విజయా! మన వాడనే వాడు ఒకడుండాలని నాకూ ఉంది. కాని యింతవరకూ ప్రకృతి సహజంగా మనకా అదృష్టం కలగలేదు" అని. "నాకో ఆలోచన తోస్తోంది చెప్పనా?" అన్నాడు.

విజయ కళ్ళు ఆనందంతో మెరిశాయి.

చెప్పమన్నట్లు చూచింది.

"ఎవరయినా దిక్కులేని బిడ్డను ఒకడిని చేరదీసి పెంచుకుంటే?" భార్య మొహం వైపు సందేహంగా చూస్తూ అన్నాడు రాజశేఖరం.

విజయ మొహంలో అతడాశించిన ప్రోత్సాహం కనిపించలేదు. మనసు కాస్త నిరాశకు గురయింది. అయినా-

"ఏం విజయా ఏమంటావ్?" అన్నాడు.

"దిక్కులేని బిడ్డను చేరదీస్తే నలుగురూ చిన్నతనంగా చూస్తారండీ! అప్పుడు మనం మరింత మానసిక క్షోభకు గురి కావలసి వస్తుందేమో! కాస్త మీరూ ఆలోచించండి".

"విజయా! నీ మనసులో వేరే ఉద్దేశ్యం ఏమన్నా ఉంటే చెప్పు, బాగుందంటే అలాగే చేద్దాం".

"ఇంతకూ ఎవరిని దత్తు తీసుకుంటే బాగుంటుందంటారు?"

"అది కాస్త ఆలోచించ వలసిన విషయమే విజయా. ఎందుకంటావా, ఏ పిల్లవాడిని మనం చేరదీసినా వాడి కోసం మాటికి మాటికీ వాళ్ల వాళ్లు ఎవరో ఒకళ్లు తరుచు వస్తూండడం జరుగుతూంటుంది. దత్తు తీసుకోగానే వాడు నీ కొడుకేనని మనసారా భావించే నువ్వు వాడు చేసే అల్లరి పనులకు కోపించడం కూడా చాలా సహజం.

అది పట్టుకుని నువ్వు వాళ్ల కన్న బిడ్డను ఏదో ఆరడి పెడుతున్నావని భావించి వాడిని వాళ్లు వెనకేసుకు రావడం జరుగుతుంది. నీ మనసు కష్టపడుతుంది. ఈ రభస మధ్య ఆ పిల్లవాడికి మనకీ మధ్య అనుబంధం ఏర్పడడం కష్టమౌతుంది.

దానితో ఆ దత్తుడు అటును అందకుండా, పోకను పొందకుండా అన్న చందంగా తయారవుతాడు. కేవలం మనడబ్బు కోసమే మన




"బంధువర్గంలో ఎవరైనా పిల్లవాణ్ని దత్తు తీసుకుందామండీ!"

"నీ మాట నేనెప్పుడయినా కాదన్నానా? అలాగే చేద్దాం".

రాజశేఖరం మాటలతో విజయ ముఖం వికశించిన పుష్పమే అయింది.

"ఏమండీ!" పిలిచింది విజయ.

"ఊఁ! చెప్పు".

ఎదుట ప్రేమాభిమానాలు ఒలకపొయ్యటం జరుగుతుంది.

"ఏం పెడితే మాత్రం నువ్వు మా అమ్మవవుతావా" అన్న సామెతకు అనుగుణంగా వాడి యొక్క నిజమయిన ప్రేమాభిమానాలు వాడిని కన్న తల్లిదండ్రుల మీదే ఉంటాయి. అందుచేత నువ్వు కాస్త సావధానంగా ఆలోచించు".

"మీదంతా మరీ చోద్యం సుమండీ! ఎక్కడో ఎవరినో అలాటి వాళ్ళను చూచి ఉంటారు. దానితో అందరిని అదే గాట కట్టేస్తున్నారు."కాస్త నిష్ఠూరంగా అంది.

"ఛ! ఛ! అదేంలేదు. మనలో కలిసిపోయే పిల్లాడూ, చీటికీ మాటికీ వాడిని చూసి పోవడం అనే వంకతో మాసాల తరబడి మన యింట తిష్ఠ వేసేవారూ కాని కుటుంబం ఉంటే చెప్పు. తప్పక తీసుకుందాం. కాని ఇంతకూ వాళ్ళు పిల్లాడిని దత్తత యివ్వడానికి అంగీకరించడం కష్టం అనుకుంటాను."

"మి వెర్రిగాని ఎందుకివ్వరండీ! ఎగిరి గంతేసి మరీ యిస్తారు. మనకా ఇప్పటికే బోలెడు డబ్బుంది. మీరా ఈనాటికీ వ్యాపారంలో రెండు చేతులా ఆర్జిస్తున్నారు".

"విజయా! దత్తతకు నిర్ణయింపబడ్డ పిల్లవాడు మరణించినట్టు భావించి వాడికి అపరకర్మలు చేయిస్తారు ఆ తల్లిదండ్రుల చేత.

తరువాత వాడిని అగ్నిహోత్రం మీదుగా దత్తు తీసుకునే దంపతులకు జననీ జనకులచేత మంత్రాలు చదువుతూ అందజేయిస్తారు.

అప్పుడు వాడు వారి గర్భవాసాన జన్మించినట్టు బారసాల నామకరణం వగైరా తంతు జరిపిస్తారు.

సాధారణంగా ఇలాట తంతుకు అంగీకరించే వాళ్ళు దొరకరేమో?"

"మీకన్నీ సందేహాలే. మనం నోరు విడిచి అడగాలే గాని మా అన్నయ్య తన కొడుకును కళ్ళ కద్దుకుంటూ ఇస్తాడు". ఆనందంగా చెప్పింది విజయ.

సరే నీ యిష్టం. అలాగే అడుగుదాం".

"ఒరే అబ్బాయ్! నేనంతా వింటూనే ఉన్నాను.

# పుత్రేషణ

దత్తతకు సంబంధించిన కర్మ కాండ అంతా బాగానే చెప్పావు. కాని ఒకటి మరచిపోయావు. అదే ముఖ్యమయినది. అప్పుడే లోపల కడుగు పెడుతూ అంది రాజశేఖరం తల్లి.

రాజశేఖరం విజయ ఆ వైపుగా చూస్తూ ఉండిపోయారు.

"ఆ తెచ్చుకొనే పిల్లాడు స గోత్రంలో వాడే అయి వుండాలి. పరాయి గోత్రాల వాళ్ళు పనికిరారు" చెప్పిందావిడ.

తన అత్తగారు ఏదో మడత పేచీ వేస్తోందని అర్థం చేసుకుంది విజయ.

"అయితే యిప్పుడు మేమేం చెయ్యాలో చెప్పవే అమ్మా!" అన్నాడు రాజశేఖరం.

"నీ పెద్దన్నయ్య రెండో కొడుకు లేడూ! వాణ్ణి దత్తు తీసుకో. ఇహానికి ఇహమూ పరానికి పరమూను".

తన భర్త పెద్దన్నయ్య అనంతనారాయణ. ఆతడి రెండో కొడుకు పేరు లక్ష్మణరావు. పేరు మాత్రమే లక్ష్మణరావు. వయసు పదహారుకు మించకపోయినా వాడు వెయ్యని వేషాలు లేవు. పోని పోకిళ్ళు లేవు. వాడినే కనక దత్తుడుగా తెచ్చుకుంటే తమ పుట్టి కుక్కలు కూడా పడవని విజయకు తెలుసు.

తన అత్తగారి ఎత్తు వేరు. దత్తత పేరుతో యిక్కడిది పెద్ద కొడుక్కి దోచి పెట్టి తద్వారా పెద్ద కోడలి మెప్పు సంపాదించాలని.

తను ఏమయినా ప్రత్యేకంగా చెపితే తాను తన అన్నగారిని వెనకేసుకు వస్తోందని భర్త అపార్థం చేసుకుంటాడని భయం. దానితో ఆమె ఏమీ మాటాడకుండా ఉండిపోయింది.

పెద్ద బావగారి కొడుకును దత్తు తీసుకుందుకు వీల్లేదని తను ఖచ్చితంగా చెప్పిందంటే తన భర్త కాదనడని తెలుసు. కాని దానితో ఎవరో ఒకరు తమ బిడ్డగా దొరికే భాగ్యం చెయ్యి జారిపోయిందని భయమూ, విజయ మనసును కల్లోల పెట్టాయి. అందుకే మౌనంగా ఉండిపోయింది.

విజయ ముఖం వైపు చూచాడు రాజశేఖరం.

తన తల్లి ప్రతిపాదన ఆమెకు నచ్చలేదని ఆమె మొహం చూడగానే అర్థమైంది.

"అయినా, "విజయా! మా అమ్మ ఏదో అంటోంది కదా! నీ ఉద్దేశ్యం ఏమిటి?" అని అడిగాడు.

"నా ఉద్దేశ్యానికేం లెండి". అని, "పోనీ ఓ పని చేద్దామా?" అంది.

"చెప్పు".

"మీ అన్నయ్యగారి పిల్లాడు లక్ష్మణరావునూ మా అన్నయ్యగారి కొడుకు నరసింహాన్ని కూడా తెచ్చి కొన్నాళ్ళ పాటు మన దగ్గర అట్టి పెట్టుకుందాం. కొంత కాలం అయేటప్పటికి ఇద్దరిలో ఎవరు బుద్ధిమంతులో తేలిపోతుంది. అప్పుడు దత్తత నిర్ణయం తీసుకుందాం. ఏమంటారు?" అంది విజయ.

మూడో నాటికల్లా రాజశేఖరం అన్నయ్య అనంత నారాయణ, వదిన కాంతమ్మ, కొడుకు లక్ష్మణరావు వచ్చి వాలారు.

రెండు మూడు రోజులు గతించాయి.

అనంతనారాయణ రాజశేఖరంతో, "తమ్ముడూ! అమ్మ పెద్దదయింది. చాకిరీ చెయ్యలేదు. ఇక మరదలా? ఇన్నాళ్ళూ చిన్న సంసారం నెట్టుకొస్తోంది. ఇప్పుడు కుర్రాడొకడు చేరాడు. ఇందరిని సమర్థించుకు రావడం మరదలు వల్ల కాదు. కాస్త అలవాటయే దాకా మీ వదిన ఇక్కడుంటుంది. ఇవాళ బయలుదేరి నేను వెళతాను". అని, "మన శాస్తుల్లుగారి చేత దత్తతకు ముహూర్తం పెట్టించమంటావా?" అన్నాడు.

"ముహూర్తానికేం తొందర లేదన్నయ్యా! కావాల్సిన వాళ్ళం అయాక దత్తత ఒకటీ అడ్డు వస్తుందా! ఆ విషయం తరువాత చూద్దాం". అన్నాడు రాజశేఖరం.

అనంతనారాయణ తన భార్య కాంతమ్మకు ఏవో జాగ్రత్తలు చెప్పి ఆ రోజే బయలుదేరి వెళ్ళాడు.


మరో రెండు రోజుల్లో విజయ అన్నయ్య భావనారాయణ వచ్చాడు. ఆతడితో పాటు కొడుకు నరసింహం వచ్చాడు.

భావనారాయణ వస్తూనే రాజశేఖరంతో, "బావా! మా చెల్లి ఏదో పుట్టింటి అభిమానం కొలదీ మా నరసింహాన్ని దత్తు తీసుకోవాలని కుతూహల పడుతోంది. కాని మీ అన్నగారి కొడుకుండగా మరొకర్ని దత్తుడుగా చేసుకోవడం బాగోదని నా ఉద్దేశ్యం". అన్నాడు.

"ఆ విషయంలో ఇప్పుడేం తొందరలేదు బావా! పిల్లవాణ్ణి ఎలాగూ తీసుకు వచ్చారు. ఈ వేసవి అయే వరకూ యిక్కడే ఉంచండి. ఒకవేళ నేను మీ వాణ్ణి దత్తు తీసుకోకపోయినా వాడి భవిష్యత్తుకు బాట వేస్తాను" అని చెప్పాడు రాజశేఖరం.

భావనారాయణ కొడుక్కి తగిన బుద్ధులు చెప్పి వెళ్ళాడు.

రోజులు గడుస్తున్నాయి. లక్ష్మణరావు రాజశేఖరం మధ్య మధ్య యిచ్చే డబ్బుతో జల్సాగా సినీమాలు షికార్లు కానిస్తున్నాడు.



అవసరమైతే రాజశేఖరం దగ్గరకు వచ్చి, "బాబాయ్! నాకిది కావాలి. అది కావాలి" అని ఆజ్ఞాపూర్వకంగా చెప్పి జరిపించుకుంటున్నాడు.

నరసింహం అందుకు భిన్నంగా విజయా రాజశేఖరాలకు తలలోని నాలుకలా వ్యవహరిస్తున్నాడు.

అది చూచి రాజశేఖరం తల్లి పెద్దకోడలితో ఓ నాడు, "ఆదేమిటే నీ కొడుకు? వాడిని ఏదో అందలం ఎక్కించాలని నేను చూస్తుంటేను" అంది.

అందుకు కాంతమ్మ, "ఇంకా కుర్రాడు కదత్తయ్యా!" అంది ముసి ముసిగా నవ్వుతూ.

"అదేమిటే అలా అంటావు. ఆ నరసింహం కూడా మన లచ్చున్న ఈడు వాడే! వాడెలా ఉంటున్నాడో చూడు" అంది అత్త.

"అఁ! పోనిస్తురూ. మీ మనవడికేమండీ మహరాజు! పూటకు గతిలేని ఆ నరిసి గాడితో వీడికి పోలికేమిటి?" ఈసడింపుగా అంది కాంతమ్మ.

విజయ అన్నీ వింటూనే ఉంది. కాని తనకెందు కన్నట్టు చూచీ చూడనట్టు ఊరుకుంటోంది. తమ యింటికి యిద్దరు పిల్లలను చేరదీసారు. కాని ఏ పిల్లడూ తమను అమ్మా నాన్నా అని పిలవడం లేదు. వరుసలు పెట్టే పిలుస్తున్నారు.

కుర్రాళ్ళిద్దరికీ ఓ రోజు విజయ ఆ విషయం చెప్పింది కూడాను.

బావగారి కొడుకు, "పిన్నీ! ఇంకా దత్తత అవలేదు కదా! అయ్యాక చూచుకుందాంలే!" అన్నాడు తలెగరేస్తూ.

ఇక అన్న కొడుకు. "అదేమిటో అత్తయ్యా! అన్నీ తెలిసే వయసు వచ్చిందేమో ఎంత ప్రయత్నించీ అలా పిలవ లేకపోతున్నాను. నన్ను మన్నించత్తయ్యా" అన్నాడు.

ఎన్ని చెప్పినా విజయ ఓ స్త్రీ హృదయమే! 'అమ్మా!' అని నోరారా పిలిపించుకోవాలనే కోరిక ఆమెకూ సహజమే! అయితే ఇద్దరు పిల్లలను చేరదీసినా ఆమె కోరిక కోరికగానే మిగిలిపోతోంది.

ఇక తన కోరిక తీరాలంటే భర్త సూచించిన మార్గం వినా గత్యంతరం లేదనే అనిపిస్తోంది.

ఆ రోజు తన నిర్ణయం భర్తకు చెప్పాలనే నిర్ణయానికి వచ్చింది.

తన బిడ్డ లక్ష్మణరావు తోటి కోడలు విజయకు నచ్చలేదని అర్థమయింది కాంతమ్మకు. ఏది ఏమయినా తన కొడుకే ఆ యింటికి యజమాని కావాలని ఆమె దృఢసంకల్పం.

అందుకు నరసింహం అడ్డు వస్తున్నాడు.

వాడి అడ్డు తొలగించాలి ముందు.

కొడుకు లక్ష్మణరావును పిలిచి వాడి చెవిలో ఏదో చెప్పింది. వాడు సరేనన్నాడు.

★ ★ ★ ★

"విజయా!" పిలిచాడు రాజశేఖరం.

"ఏమండీ!" అంటూ వచ్చింది విజయ.

"నా జేబులో పర్సు కనిపించడం లేదు. నువ్వు తీసి ఎక్కడయినా పెట్టావా?"

"లేదండీ! మీకు చెప్పకుండా తీస్తానా?"

"మరేమయినట్టు?"

"ఏమయ్యేయు మరిదీ! ఇందాకా ఆ నరసింహం అక్కడ తచ్చాడుతూండగా చూసాను. ఏదో కుర్ర తనం కొద్దీ వాడు తీసాడేమో అడుగు" అంది వదిన కాంతమ్మ.

రాజశేఖరం నరసింహాన్ని పిలిచి అడిగాడు.

"నే తియ్యలేదు మామయ్యగారూ!" ఏడుస్తూ చెప్పాడు నరసింహం.

"మొగుణ్ణి కొట్టి మొగసాలకు మొర్ర పోయిందన్నట్టు అడగడానికి ముందే ఏడుపు లంకించుకున్నాడు చూడు. వాడి పెట్టి వెతకండి ముందు" అంది రాజశేఖరం తల్లి.

ఆ మాట అంటూనే ఆమె, పెద్ద కోడలూ కలిసి వెళ్ళి నరసింహం పెట్టె తెరిచారు. పెట్టెలో పైనే ఉంది పర్సు. కాని అందులో డబ్బు మాత్రం లేదు.

"డబ్బెక్కడ దాచావురా దౌర్భాగ్యపు వెధవా!" అంటూ నరసింహం జుట్టు పట్టుకుని చావబాద సాగింది రాజశేఖరం తల్లి.

"నాకేం తెలియదు బామ్మగారూ! నాకేం తెలియదు బామ్మగారూ!" అంటూ దెబ్బలు తింటూనే ఏడ్వసాగాడు నరసింహం.

"వేలెడు లేడు! దొంగ వెధవ! ఎంత నాటకం ఆడుతున్నాడో చూడండత్తయ్యా! పోలీసుల్ని పిలిపిస్తే సరి." అని సాగదీసింది కాంతమ్మ.

అంతవరకూ మౌనంగా ఉంది విజయ.






## పుత్రేషణ

నరసింహం ఎలాటివాడో ఆమెకు బాగా తెలుసు. అత్తగారూ తోటి కోడలూ కలిసి ఏదో పెద్ద పన్నాగమే పన్నారని ఆమె అనుమానం.

విజయకు విపరీతంగా కోపం వచ్చింది.

"ఆగండి!" అని ఒక్క కేకపెట్టింది.

ఆ కేకతో అంతవరకూ ఒళ్ళు తెలియని వీరావేశంతో నరసింహాన్ని కొడుతున్న అత్తగారు ఉలిక్కి పడింది. నరసింహాన్ని కొట్టడం ఆపింది.

"అక్కయ్యా!" తోటికోడలు నుద్దేశించి అంది విజయ.

"ఏమమ్మా?" అంది కాంతమ్మ.

"అక్కయ్యా! నువ్వు చెప్పింది బాగుంది. పోలీసులనూ పిలవ వలసిందే!" అంది విజయ.

కాంతమ్మ మొహం చింకి చాటంతయింది ఆ మాటతో.

"ఒరేయ్ లచ్చిగా! పోలీసులకు ఫోన్ చెయ్యరా!" కొడుకు నుద్దేశించి అంది కాంతమ్మ.

లక్ష్మణరావు ఫోన్ |ఫోన్ నడవ బోతూండగానే వారించి, "అక్కయ్యా! పోలీసులను పిలిచేముందు మన లక్ష్మణుడి పెట్టి కూడా ఒకసారి చూద్దాం." అంది.

అందుకు అత్తా పెద్ద కోడలూ అభ్యంతరం పెట్టారు.

విజయ బలవంతంగా లక్ష్మణరావు పెట్టి తెరిచింది.

పెట్టిలో బట్ట లన్నిటికీ అడుగున దొంతిగా కనిపించాయి రూపాయలు.

ఇప్పు డేమంటా వన్నట్టు తోటికోడలు వైపు చూచింది.

కాంతమ్మ మొహం పాలిపోయింది. కొడుకుతో పర్సు డబ్బుతో సహా నరసింహం పెట్టిలో పెట్టమని చెప్పింది తను.

"నైజగుణానికి తప్ప కంటికి మందు లేదు" అన్న సామెతగా వాడు వాడి గుణం పోనిచ్చుకున్నాడు కాదని వివారించింది.

తమ్ముడి టెలిగ్రాం చూసుకుని వెంటనే బయలుదేరి వచ్చాడు అనంత నారాయణ.

తమ్ముడి నోట కథంతా విన్నాడు.

అవమాన భారంతో అతడి తల వాలిపోయింది.

తమ్ముని మాటకు మారు పలుకకుండా భార్యనూ కొడుకునూ వెంట పెట్టుకుని బయలు దేరాడు.

"అన్నయ్యా! అమ్మ పోషణ నిమిత్తం నెల నెలా డబ్బు పంపిస్తాను. ఆమెను కూడా నీ వెంట తీసుకుపో!" చెప్పాడు రాజశేఖరం.

తల్లి, తన భార్య కలిసి చేసిన దౌర్భాగ్యపు పనికి అనంత నారాయణ అప్పటికే ఎంతో బాధపడు తున్నాడు. తల్లిని దగ్గర ఉంచుకోవడం అతడికి యిష్టం లేదు.

కాని అప్పటి పరిస్థితిలో తనేం మాటాడినా చెల్లదు.

అనంత నారాయణకు తల్లిని వెంట పెట్టుకుని వెళ్ళడం తప్పింది కాదు.

దొంగతనం పేరుతో ముసలమ్మ కొట్టిన దెబ్బలకు నరసింహానికి ఆ రాత్రికే ఒక్క పెట్టున జ్వరం ముంచు కొచ్చింది.

మూడు రోజులయినా కళ్ళు తెరవ లేదు.

"నాకేం తెలియదు బామ్మగారూ! నేను దొంగను కాదు మామయ్యగారూ!" అంటూ సంధి ప్రేలాపన.

ఓ రోజు విజయ, "ఏమండీ! ఈ దత్త పుత్ర శోకం నేను భరించలేను. వీడికేమయినా అయితే యిక పలుగురిలోనూ తల ఎత్తుకోలేం. మా అన్నయ్యనూ, వదిననూ వెంటనే రమ్మని పిలిపించండీ!" అంది ఏడుస్తూ.

రాజశేఖరం కబురందుకుని భావనారాయణ దంపతులు వెంటనే బయలుదేరి వచ్చారు.

ఆ పట్టు పట్టు నెల్లాళ్ళకు గాని తేరుకోలేదు నరసింహం.

అందరూ "అమ్మయ్య!" అనుకుని తేలిక పడ్డారు.

ఓ రోజు రాజశేఖరం భావనారాయణతో, "బావా! జరిగిన దానికి చాలా సిగ్గుపడు తున్నాను. నన్ను మన్నించు. మీ పిల్లవాడు మీ దగ్గరే ఉండడం ఉభయులకూ శ్రేయస్కరం.

అయితే నువ్వేం బాధపడక్కర లేదు. నేను ముందుగానే వాగ్దానం చేశాను. నరసింహం చదువు సంధ్యల కయ్యే ఖర్చు గురించి నువ్వు దిగులు పడకు. ఆ భారం అంతా నాది." అన్నాడు.

భావనారాయణ సరే నన్నాడు.

ఇక యింటికంతా మిగిలినది విజయా రాజశేఖరాలు.

జరిగిన రభస తాలూకు మచ్చ మాసిపోవడానికి కొన్ని మాసాలు పట్టింది విజయా రాజశేఖరాలకు.

విజయకు ఇంట్లో ఒంటరిగా కాలం గడవడం లేదు.

ఓ నాడు భర్తతో, "ఏమండీ! మీరన్నట్టే ఎవరైనా మనకు తగిన అనాథ బాలుణ్ణి పెంచుకుందామండీ! అది కూడా పురిటి కందయితే మరీ మంచిది." అంది విజయ.

"అలాగే!" అన్నాడు రాజశేఖరం.

"ఏమండీ! ఆ బిడ్డ ఏ యింటికి చేరుతున్నదీ కన్నవారికి తెలియ కూడదు." అంది విజయ.

"అయితే అలాటి ఏర్పాటు చేయమని ఈ రోజే మన ఫ్యామిలీ డాక్టరుకు చెబుతాను విజయా!" అన్నాడు రాజశేఖరం. □

## నేనే

అక్షరాల అరణ్యంలో
అందమైన పూలు వెతికి
పరిమళాన్ని చిందించే
పరాగమాఘ్రాణిస్తూ
మనసుల మైమరపించే
మకరందాన్నొలికిస్తూ...
అంతులేని లోతుల్లో
అవపడకుండా దాక్కొని
అంత వింత ప్రపంచాన్ని
అవలీలగా సృజించిన
భగవంతుణ్ణైనా సరే
భావాలలో బంధిస్తూ...
సూటిగ చెప్పాలంటే
సాటిలేని రసజ్ఞుల ఎదలను
మాటిమాటికీ తీయని
మాటలతో స్పందిస్తూ
మనిషికీ, బ్రతుకుకూ మధ్య
మంథనలో ప్రాప్తించిన
విషమైనా అమృతంలా
వినియోగం చేసేందుకు
ప్రతి శబ్దములో సొగసును
ప్రజలకు పంచేది నేనే-
రవి మెట్టని
భువి మెట్టిన
కవిని
సృష్టికర్త ఛవిని

-ఏల్చూరి విజయరాఘవరావు


కూపన్

ఆంధ్ర సచిత్ర వార పత్రిక

### చింతలూరు ఆయుర్వేద ఫార్మశీ వారి వైద్య సలహాలు

ప్రశ్న: ..............................................................................................

..............................................................................................

పంపినవారి పేరు: ..............................................................................

పూర్తి చిరునామా: ..............................................................................